

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 ఏప్రిల్, 2023 సంచిక : 11

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
రెండు సంవత్సరాలకు చందా..రూ॥200/-
10 సం.రాలకు చందా....... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
మానవుడు-దైవం ........ 6
శాశ్వత ధర్మగోప్త ........ 11
సాయిభక్త దాసగణు ........ 14
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 17
మనస్సును మళ్ళించాలంటే ........ 18
Human Birth and Opportunity .. 23
సాయిదత్త ప్రచారంలో ........ 27
నువ్వెవరు-నేనెవరు ........ 28

(ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.)







## మా వాణి



ప్రియ పాఠకులందరికీ సాదర ప్రణామాలు.

ఎప్పుడో, ఎక్కడో ఇది చదివిన గుర్తు. మహాభారత యుద్ధం జరుగుతోంది. అభిమన్యుడు పద్మవ్యూహం ఛేదించబోయి మరణించాడు. ధర్మజుడు కృంగిపోయాడు. తాను స్వయంగా పంపించాడు లోపలికి. వాడు తిరిగి రాలేదు. త్రిగర్తపతి సుశర్మ అదే సమయానికి చెలరేగి పాండవ సైన్య సంహారం చేస్తున్నాడు. అటు అతని మీదికి వెళ్లారు అర్జునాదులంతా. అందుచేత అభిమన్యుడికి సాయం అందలేదు. దుఃఖంతో వెర్రివాడై అరిచాడు ధర్మరాజు. “ఆ గాండీవం ఎందుకు తగలబెట్టానా?” అని అర్జునుడు తెల్లబోయాడు. తన గాండీవాన్ని నిందించిన వారి తల ఖండిస్తానని తన ప్రతిజ్ఞ. ఆ మాట అన్నవారు అన్నగారు. ఎలా? అన్నను చంపటం కన్నా ఆత్మాహుతి మేలు గదా! ఆ సమయంలో ఆదుకున్నాడు శ్రీకృష్ణుడు.

“నీకంటే యోగ్యులను, మాన్యులను గట్టిగా నిందిస్తే హత్య చేసినంత పాపం వస్తుంది. అందుచేత ధర్మరాజును గట్టిగా కోప్పడు. దానితో నువ్వు అతన్ని చంపినట్లే అవుతుంది. నీ ప్రతిజ్ఞ నెరవేరుతుంది. ధర్మరాజుకు కీడు వాటిల్లదు. కృష్ణుని మాటలు వింటూనే అర్జునుడు విరుచుకుపడ్డాడు ధర్మరాజు మీద.

అసలు నీ మూలంగానే మాకీ కష్టాలు. నీవు జూదానికి దిగకుండా ఉంటే యీ యుద్ధమే వచ్చేది కాదు. బంగారంలాంటి నా బిడ్డ దాయాదులకు బలి అయ్యేవాడు కాడు. మేము నీ మాట జవదాటం గదా- అని నీ యిష్టం వచ్చినట్లు మా అందరితో ఆటలాడుకున్నావు యీ పంపిణీ మీద నోటికి వచ్చినట్లు మాట్లాడాడు.

అటుపైన కూర్చొని కన్నీళ్ళు కార్చసాగాడు. "బావా? పుట్టి బుద్ధెరిగాక మా అన్నగారిని వ్యతిరేకించిగానీ, తూలనాడిగానీ ఎరుగను. ఇలా మాట్లాడి ఆయన మనస్సెంతో గాయపరిచాను. ఈ విషయం అమ్మకు తెలిస్తే నన్ను క్షమించదు. పైగా జ్యేష్ఠభ్రాతను చంపినంత పాపానికి పాల్పడి కూడా యింక నేను బ్రతకటం అనవసరం. ప్రాయోపవేశం చేస్తాను'' అని సిద్ధమవుతున్నాడు.

మళ్లీ శ్రీకృష్ణుడు అడ్డుపడ్డాడు. ఆగవయ్యా బాబూ! అంత తొందరేం? పరనింద చేశావు. అందునా వృద్ధనింద, సాధునింద చేశావు. అందువలన హత్యాపాపం చుట్టుకుంది. దానికిగాను శిక్షగా నీవు ఆత్మహత్య చేసుకో దలచుకున్నావు. అయితే పరనింద ఎలా హత్య సమ నేరమో, ఆత్మస్తుతి ఆత్మహత్యతో సమానం. ఇప్పుడు నీవు నీ గొప్పతనం గురించి పొగుడుకో. దానితో నీవు మృతసమానుడవైనట్లే" అన్నారు ఆయన. వెంటనే అర్జునుడు తాను ఏఏ వీరులను, ఏఏ రాక్షసులను, ఎక్కడెక్కడ ఎలా ఓడించింది? వివరించుకుంటూ డబ్బా వాయించుకోసాగాడు. ఒక అరగంట సేపు అలా మోగనిచ్చి కృష్ణుడు 'ఇక చాలు' అన్నాడు. ఇప్పుడు నీవు చచ్చిపోయావ్! ఇక విచారం మానివెయ్యి' అన్నాడు. దానితో సమస్య ముగిసిపోయింది.

పై ఇతిహ్యాం వలన ఏం తెలుస్తోంది. సాదునింద, గురునింద, వారిని హత్య చేయడంతో సమానమని, ఆత్మస్తుతి, ఆత్మహత్యతో సమానమని తెలుస్తోంది. చాలాసార్లు తెలిసో, తెలియకో మనం యీ పాపాలు చేస్తూ ఉంటాం. సపత్నేకర్, షేవడే మిత్రులు. షేవడే 'లా' పరీక్షలో తాను తప్పక పాసవుతాననీ, బాబా ఆశీస్సులు తనకున్నవనీ" అన్నాడు. 'నీకేమీ రాకుండా ఎలా పాసవుతావు? ఈ బాబాలను నమ్మితే మునుగుతావు' అంటూ బాబాగారిని నోటికి పట్టనన్ని మాటలు మాట్లాడాడు సపత్నేకర్. దానివలన తనకేం జరుగుతుందో ఊహించలేకపోయాడు. ఒక్కానొక్క బిడ్డను పోగొట్టుకొని, ఏడాదిపాటు విచారించి, తన దోషం తాను తెలుసుకొని





బాబా వారి పాదాలు పట్టుకొన్న తరువాతనే ఆయనకు మళ్లీ సంతానోదయం ప్రాప్తించింది.

దక్షుడు తారలకు, సతీదేవికి కన్నతండ్రి. తన యిష్టానికి వ్యతిరేకంగా సతీదేవి ఈశ్వరుణ్ణి వరించిందని దక్షుడు ఆ దంపతుల మీద చాలా క్రోధం పెంచుకున్నాడు. తన ఇంట మహాయజ్ఞం చేస్తూ పెద్ద బిడ్డనూ, అల్లుణ్ణి మాత్రం పిలవలేదు. పుట్టింటి మీద మమకారంతో పిలవకపోయినా వెళ్లింది సతీదేవి. దక్షుడు ఆమె అభిమానాన్ని గుర్తించక తన కక్షనే ప్రదర్శిస్తూ పరమేశ్వరుణ్ణి నానామాటలు తూలనాడాడు. సతీదేవి అతణ్ణి స్వయం పరమేశ్వరుణ్ణి నిందిస్తున్నావు. దీని ఫలితాన్ని అనుభవించవలసి వస్తుందని హెచ్చరించింది. దక్షుడు యింకా చెలరేగిపోయి తన అల్లుడు కశ్యపుడు ఎంత గొప్పవాడో, చిన్న అల్లుడు చంద్రుడు ఎంతటి సుందరాకారుడో, చివరికి తానెంత మహదైశ్వర్యవంతుడో శతవిధాల వర్ణిస్తూ విర్రవీగిపోయాడు. మనస్తాపం చెందిన సతీదేవి స్వయంకల్పితమైన అగ్నిలో ఆత్మాహుతి చేసుకున్నది. మరునిముషంలో ఏం జరిగింది? పరమశివుని జటాజూటం నుండి వెలువడిన వీరభద్రుడు విజృంభించాడు. చిచ్చరకంటి వాడై పరమశివుడు స్వయంగా కదిలాడు. దక్షయజ్ఞం ధ్వంసమైంది. కశ్యపుడు శివుని శరణార్థికాగా, చంద్రుడు శివుని పాదాల క్రింద పడి ముక్కలయ్యాడు. దక్షుని ఐశ్వర్యంగానీ, అక్కడ ఉన్న అనేకమంది వేదవేత్తల పాండిత్యంగానీ, అతన్ని రక్షించలేకపోయాయి. చివరికి దక్షుని భార్యలు వేడుకోగా శివుడు అతన్ని విడిచిపెట్టాడు.

చిన్నపిల్లలు ఆటలాడుతూ పైకి ఉమ్మివేస్తారు. అది తిరిగి వారి ముఖానే పడుతుంది. భగవన్నింద, భాగవత నింద కూడా ఆకాశం మీదకు ఉమ్మి వేయటం వంటివే. మనకు అవసరం వచ్చినపుడు దేవునికి వెయ్యిరకాల విన్నపాలు చేసుకుంటాం. కోరికలు నెరవేరితే స్వామి వలననే మా పిల్లలకు ప్రమాదం తప్పింది, మా అమ్మాయికి యీ సంబంధం కుదిరింది, మాకు

యీ మేలు జరిగింది అని యిలా చెప్పకుంటాం. ఏదైనా తీరని కష్టం వచ్చిపడిందీ-ఈ దేవునికి మతి చెడింది, దయ తప్పింది. ఇలా ఆయన నెత్తినే దోషం రుద్దుతాం, గురువుల పట్ల కూడా యిలాగే ప్రవర్తిస్తాం. ఇది మన నైజం.

బాబా చరిత్రలో ఒకచోట బాబాగారు రెండు మేకపిల్లలను కొన్న కథ ఉంది. "అతి తక్కువ ఖరీదు చేసే మేకలను బోలెడంత డబ్బు పోసి కొన్నారు బాబాగారు. తెలివితక్కువ పనిచేశారు" అని భక్తులంతా అనుకొన్నారు. శిష్యులు మాత్రం "ఇందులో ఏదో అంతరార్థం ఉంటుంది అనుకొని "ఎందుకలా చేశారు మాకు వివరించరా అని అడిగారు. ఇది వివేక పద్ధతి. కానీ, మనం సాధారణంగా అవివేకాన పడుతూ ఉంటాం. మన చదువు, సంస్కారం, తెలివితేటలు, చుట్టూ ఉన్న నలుగురూ మనను ఆకాశాని కెత్తడం వగైరా వగైరాలన్నీ కలిసి మన లోలోపల ఒకానొక ఆత్మవిశ్వాసం అంచులుదాటిన అహంకారపు పొరను తెరుస్తాయి. మనం ఆ పొర గుండానే ప్రపంచం అంతటినీ చూస్తాం. మనవైన ఆ కొలతలతోనే సాధువు లనూ, సద్గురువులనూ ఏమిటి భగవంతుని కూడా కొలుస్తాం. సాధు పద్ధతి వేరూ, సామాన్య పద్ధతి వేరూను.

ఓ సాధువు నదీస్నానం చేస్తున్నాడు. ఒక తేలు పొరపాటున నదిలో కొట్టుకొస్తూ ఉంది. సాధువు దాన్ని తీసి ఒడ్డున వేద్దామన్న సత్సంకల్పంతో దోసిట్లోకి తీసుకున్నాడు. వెంటనే అది ఆయనను కుట్టింది. బాధతో చటుక్కున వదిలాడు. అంతలోనే ఆదరభావం ఆయన బాధను గెలిచింది. మళ్లీ చటుక్కున తేలును పట్టుకున్నాడు. మళ్లీ అది కరిచింది. సాధువు చెయ్యి విదిలించడంతో మళ్లీ అది నీళ్లలో పడింది. ఇలా ఆయన తియ్యడం, ఇది కుట్టడం ఐదారుసార్లు అయ్యాక ఒడ్డు నుండి ఇదంతా చూస్తోన్న గ్రామీణుడొకడు "ఏమయ్యా! అది కుడుతూనే ఉంది. మళ్లీమళ్లీ నువ్వు దాని జోలికి పోతున్నావ్?" అని అన్నాడు. దానికి సాధువు "నాయనా దాని సహజగుణం అది చూపిస్తూ ఉంది. మరి నా సాధుగుణం నేను చూప





వద్దూ!" అన్నాడు. రామానుజాచార్యులను ఇబ్బంది పెట్టాలని ఒక దూర్తుడు ఆయన గంగాస్నానం చేసి వచ్చేదారిలో ఒక చెప్పలదండ అడ్డంగా కట్టాడు. అది ఆచార్యుల వారి తలకు తగిలింది. ఆయన తలెత్తి చూచి "ఆహా ఈవేళ ఎంత శుభదినం. ఇందరు భాగవతోత్తముల పాదధూళి దొరికింది" అంటూ సాష్టాంగ నమస్కారం చేశారు ఆ నడివీధిలోనే. అది సాధు లక్షణం.

విద్యాప్రకాశనందగిరి స్వామి వారు ఒకచోట ఇలా అంటారు - "స్వాములకు నాలుగు పూటల భోజనం పెడితే ఇకవారు మా ఒద్దికలోనే ఉండాలంటారు జనం". మనం మనవైన మమకారాలుగానీ, కాంక్షలను గానీ, ఐశ్వర్యాలనుగానీ, ఆడంబరాలనుగానీ వదలలేని వాళ్లం. అలా వదిలి వచ్చిన వాళ్ళు మనకంటే ఎంతో కొంత త్యాగులు, ఉత్తములే కదా! ఆ వివేకం మనకుంటే వారి నుండి ఏమి నేర్చుకోగలమో ఆలోచిస్తాం గానీ, మరోలా ప్రవర్తించలేం గదా! ఇక మీదట భగవంతుడు మనకు అటువంటి సదసద్వివేక చతురత కలిగించాలనీ, భాగవత సేవ, సద్గురు సేవలలోని అంతరార్థాన్ని గ్రహింపజేయాలని భగవంతుని ప్రార్థిద్దాం.

# మానవుడు-దైవం

మిట్టమధ్యాహ్నం కావస్తోంది. ప్రచండంగా పరాక్రమిస్తున్నాడు సూర్య భగవానుడు. వృద్ధులైపోయిన ఏకనాథ మహారాజుల వారు మెల్లమెల్లగా అడుగులు వేస్తూ నదీతీరంవైపు వెడుతున్నారు. జీవితమంతా దైవనామ సంకీర్తనలతో, విధి ఆచరణ, సద్బోధలతో గడిపిన ధన్యజీవి ఏకనాథుల వారు. ఇటీవల కొంతకాలంగా వారు కాస్త నీరసించి వున్నారు. ఉదయాన్నే నదీస్నానం చేయడానికి రాలేకపోయినందుకు ఎంతో చింత చెందుతూ, ఎలాగైనా సరే. స్నానం చేసి మరీ భోజనం చేయాలన్న పట్టుదలతో వారు అటువైపు వస్తున్నారు.

ఆ ఊరిలోని హరిజన యువతి మల్లిక. తన ఏడునెలల పసిబిడ్డను

రాతి నీడలో పడుకోబెట్టి బట్టలు ఉతుక్కొంటోంది ఆమె. ఆమె భర్త దూర దేశాలు వెళ్లాడు. ఎప్పుడు వస్తాడో, ఎలా ఉన్నాడో కబురేమీ తెలియలేదు. మల్లిక మనసంతా దిగులుగా ఉంది. బట్టలన్నీ ఉతికి, ఒడ్డునపెట్టి, స్నానం చేసింది మల్లిక. ఏ పనిచేస్తున్నా ఆమె మనసు భర్త మీదనే ఉండిపోయింది. పనికాగానే బట్టలున్న గంప తలమీద పెట్టుకొని ఇంటికి వెళ్లిపోతోంటే ఎదురైనారు ఏకనాధుల వారు. ఆమె చటుక్కున దారిప్రక్కకు తప్పకొని, వినయంతో తలవంచి నమస్కరించింది. చేయెత్తి దీవిస్తూ తరలిపోయారు ఏకనాథులు.

నదిలో దిగుతూనే ఆయన మనస్సు ప్రశాంతపడింది. మనసారా దైవ కీర్తన చేస్తూ తృప్తిగా స్నానం చేసి బయటకు వచ్చారు. ఒళ్లు తుడుచుకుంటుంటే విన్పించింది పసిబిడ్డ ఏడుపు, చుట్టూ చూస్తే మనుషులు ఎవరూ కన్పించలా. జాగ్రత్తగా చూస్తే రాతిబండ ప్రక్కన దాన్ని తాకుతూ ఇసుకలో పసిబిడ్డ. అత్యంత సహజమైన మానవీయ కరుణతో పరుగున వెళ్లి ఆ బిడ్డను గుండెకు హత్తుకున్నారు ఏకనాథులు. ఇందాక తనకెదురైన ఆడమనిషి బిడ్డ అయి వుండాలి. పాపం ప్రక్కమీదనే పడుకోబెట్టినట్లుంది. బిడ్డ జరిగిపోయి ఎండలోకి వచ్చినట్లుంది. కింద కాలుతున్న ఇసుక, ప్రక్కన ఎండకు కాలిన రాయి తగిలేటప్పటికి అల్లాడిపోయింది. ఏకనాథుల వారు తడబడే అడుగులతో గబగబా నడుస్తూ ఊరివైపు సాగారు.

ఇంటికి వెళ్లి బట్టలు ఆరవేయబోతుంటే గుర్తు వచ్చింది పాప మల్లికకు. కాస్త ధ్యాసలోపడి బిడ్డను మర్చిపోవడమూ, అయ్యయ్యో ఎంత తప్ప జరిగిందీ! గబగబా నదివైపు పరుగుపెట్టింది. దారిలోనే ఎదురయ్యారు ఏకనాథులు. మల్లిక రెండుచేతులూ నోటిమీద పెట్టుకొని నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. సద్బ్రాహ్మణుడు ఆయన. తన బిడ్డను తాకడమా, తెలియక తాకినా పాపమేగా అనుకున్నది మల్లిక. భయపడుతూనే వెళ్లి చేతులు చాపింది. "అంత ఎండలో మర్చిపోయావా తల్లీ పాపని", ఎంత





కరుణార్ద్రంగా అంటూ బిడ్డను అందించారు ఏకనాథులు. సరిగ్గా ఆ దృశ్యం ఆ ఊరి విప్రోత్తముల కంటపడనే పడింది. ఐదు నిముషాల్లో వార్త కార్చిచ్చులా పాకింది. ఏకనాథుల వారి ఇంటి ముందు చేరిపోయారు పెద్దలంతా.

ఏకనాథుల వారి కుమారుడు బయటకు రాగానే "మీ నాన్న ధర్మభ్రష్టుడయ్యాడు. ఏడీ, బయటకు రమ్మను" అన్నారు ఊరివారు. ఏకనాథుల వారీ కబురు వింటూనే బయటకు వచ్చి వారి ముందు సాష్టాంగపడి లేచారు. సెలవివ్వండి స్వామీ! నా అపరాధం ఏమిటి? అన్నారు. "ఏం తెలియనట్లు మాట్లాడతావేం! మాలపిల్లని ముట్టుకొని మైలపడి హాయిగా ఇంట్లో దూరతావా?" అన్నాడు పెద్ద తలకాయ.

"లేదు స్వామీ! నేను పెరట్లో స్నానం చేసే ఇంట్లోకి వచ్చాను" అన్నారు ఏకనాథులు.

"అంటే వెధవ భ్రష్టు పనులు చేసి స్నానం చేస్తే చాలా?"

"ఎండలో మాడిపోయే పసిబిడ్డను కాపాడటం తప్పా స్వామీ! సర్వ జీవరాశిలోనూ పరమాత్ముడుంటాడని మనందరికీ తెలిసిందే గదా!"

"ఓహో అలాగా! అయితే ఇకనేం-గూడెంలోనే కాపురం పెట్టు" అన్నాడు మండిపడుతూ కులపెద్ద. ఇంటిలోని ఆడవారు బావురమని ఏడవసాగారు. వెలిపెట్టిన వారి ఇంటికి ఎవ్వరూ రారు. చాకళ్ళు, మంగళ్లు కూడా రారు. వీరి పిల్లలనెవరూ చేసుకోరు. వీరింటికి పిల్లనివ్వరు. అదో నరకం.

"నా స్థానంలో మీరున్నారుగానీ ఆ బిడ్డను రక్షించకుండా ఉండలేరు స్వామీ! ఓ ప్రక్క కాలేరాయి, మరోప్రక్క కాలే ఇసుక. ఎలా వదిలిపెట్టగలం చెప్పండి. నన్ను పరమాత్ముడు క్షమిస్తాడా? అల్లాడే బాలకృష్ణుడు కాదా ఆ బిడ్డ!" ఆ మాటలు అంటూండగానే ఏకనాథుల కళ్లవెంట నీళ్లు ధారాపాతంగా కారిపోసాగాయి. భక్త్యావేశంతో ఆయన శరీరం వణికిపోతోంది.

"ఈ కబుర్లన్నీ ఆ గూడెంలో కూర్చొని ఆ చుట్టూ వాళ్లకు చెప్పకో. తెల్ల

వారేటప్పటికి నువ్వు ఇల్లు దాటి వెళ్లావా సరే-లేకపోతే నీ కుటుంబాన్ని వెలిపెట్టినట్లేననుకో" కఠినాతికఠినంగా శాసిస్తూ అట్లే అనేసి వెనక్కు తిరిగారు పెద్దలు.

సరిగ్గా అప్పడే వచ్చాడు ఓ కుష్ఠురోగి. దూరప్రయాణం చేసి వస్తున్నట్లుగా నలిగిపోయి ఉన్నాడు. కుష్ఠురోగిని చూడగానే ఒక అడుగు వెనక్కు వేశారు విప్రులంతా.

"ఎవడురా నువ్వు? ఎంత ధైర్యంగా జనం మధ్యకు వస్తున్నావు?" విసురుగా అన్నాడు ఒకాయన.

"అయ్యా, క్షమించాలి" మాది కాశీ నగరం. ఈ వ్యాధి నన్ను పట్టుకొని ఏడాది అయింది. ఎన్నో మందులు తిన్నా, తగ్గలేదు. చివరికి నా పేరిట విశ్వేశ్వరుడికి అభిషేకాలు చేయించాను. ఇదంతా జరిగి నెలరోజులు దాటిపోయింది, మొన్నరాత్రి నాకొక కల వచ్చింది. అందులో విశ్వేశ్వరుడు కనిపించాడు. నీవు ఏకనాథ మహారాజుల దగ్గరకు వెళ్ళు. ఆయన ఒక హరిజన బిడ్డను రక్షించిన పుణ్యఫలాన్ని నీకు ధారపోయమని అడుగు. ఆయనకు నిన్ను తాకమని అడుగు. దానితో నీకు ఈ వ్యాధి పోతుంది" అని చెప్పారు. ఆ మాటలు వింటూ పకపక నవ్వాడు ఒక విప్రోత్తముడు. "ఆఁ, ఆఁ, ముట్టుకో, ముట్టుకో, ఆ రోగమేదో ఆయనకు కూడా అంటించు" అన్నాడు హేళనగా. ఆ రోగి రెండు చేతులూ జోడించాడు. "స్వామీ! నేను అసత్యం చెప్పడం లేదు. శివయ్య నిజంగా నాకు కలలో కన్పించాడు, అంతకుముందు ఏకనాథుల వారి పేరు వినటమే కాని ఆయన ఎక్కడ ఉండేదీ కూడా నాకు తెలియదు. ఇప్పడే వారినీ, వీరినీ అడిగి తెలుసుకొని వస్తున్నాను" ఆయన కళ్ళు నీళ్ళు నిండిపోయినాయి.

"అడుగో, ఆయనే, నువ్వు అడిగిన ఆ మహారాజు" అన్నాడు ఒకాయన వ్యంగ్యంగా. ఏకనాథ మహారాజు ముందుకు వచ్చారు. "ఆ పేరుతో నన్నే పిలుస్తారు నాయనా" అన్నాడు మెత్తని గొంతుతో, వెంటనే ఆయన ముందు





సాష్టాంగపడ్డాడు కుష్ఠురోగి. లేచి ఏడుస్తూ "నేను నిజమే చెప్పాను స్వామీ" అన్నాడు. ఏకనాథులు "నాయనా! నేను నిన్ను నమ్ముతున్నాను. ఆ బిడ్డను రక్షించినందుకు పుణ్యమే వస్తుందో, పాపమే వస్తుందో నేను ఆలోచించ లేదు. మనిషి చెయ్యవలసిన కర్తవ్యంగా మనసులో నుంచి కలిగిన ప్రేరణతో పాపను తెచ్చి తల్లికి అందించాను. ఒకవేళ దానివలన నిజంగా ఏదైనా పుణ్యం వస్తే-అది నీ వ్యాధిని తగ్గిస్తుందంటే-తప్పకుండా అది నీకే దక్కనీ" అన్నాడు ఆర్ద్రంగా. అంటూనే ఆ కుష్ఠురోగి శిరస్సుపై చెయ్యి వుంచి ఆశీర్వదించాడు. మరుక్షణంలో ఒక అద్భుతం జరిగింది.

కుష్ఠురోగి శరీరంలోని వ్యాధి మాయమైపోయింది. బంగారువన్నెతో మెరిసిపోతున్న తన దేహాన్ని చూసుకొని ఆ కుష్ఠురోగి నమ్మలేకపోతున్నాడు. మహదానందంలో ఏకనాథుల వారి పాదాల మీద వాలిపోయాడు. ఆయన అతన్ని లేపి వీపు నిమిరి "విశ్వేశ్వరుడి కరుణ అపారమైంది నాయనా! ఆ భక్తిని విడువకు" అన్నారు.

ఇదంతా చూస్తున్న ఊరి వాళ్లకు మతిపోయినట్లైంది. ఒకాయన కాస్త జంకుతూనే "ఇదంతా కలా? నిజమా?" అన్నాడు.

"అయ్యా! ఏకనాథుల వారికి యింత శక్తి ఉందా?" అన్నాడు మరొకాయన సంశయిస్తూ.

"నా శక్తి ఏమీ లేదు స్వామీ! ఇదంతా పరమాత్ముని శక్తే. నన్నేలిన నా స్వామికి నా మీద గల అపారకరుణే అతని వ్యాధి పోగొట్టింది" అన్నారు ఏకనాథుల వారు వినమ్రంగా. ఒక్కక్షణం నిశ్శబ్దంగా గడిచింది. హఠాత్తుగా గ్రామపెద్ద ఏకనాథుల వారి పాదాలకు నమస్కారం చేశాడు. వెంటనే ఊరంతా అనుకరించింది. అటుపైన అడిగారు ఏకకంఠంతో-"మేము మిమ్మల్ని ఎందుకు సహించలేకపోయాము?"

ఏకనాథుల వారు ప్రేమ నిర్భరమైన కంఠంతో అన్నారు -"నేను గొప్పవాడినేమీ కాదు స్వామీ! భగవంతుడు చెప్పినదేదో గుర్తు పెట్టుకొని నడుస్తున్నానంతే!"

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

వసుదేవుల వారి కుటుంబ సభ్యులు తరచు వెళ్తుంటారు. సత్యకుడు, అక్రూర, ఉద్ధవులు, సాత్యకీ, కృతవర్మాదులు కూడా కుటుంబాలతో సహా తాపసులను దర్శించి, సేవించి, ఆశీస్సులను పొందడానికి వెళ్తుంటారు. అక్కడ ఒక కుటీరం ప్రధానమైన కూడలిలో ఉన్నది. దానిలో నీవు ఉందువుగాని. ఆ తరువాత ఏమి జరుగుతుందో బుద్ధితో చూస్తూ ఉండు. నేను చెప్పినదాకా నిన్ను నీవు తెలుపుకోకు ఇంద్రప్రస్థం నుంచి నేను పంపిన చారుడు రావాలి. అప్పడు మన వ్యూహం పూర్తి అవుతుంది' అని కృష్ణుడు అతనితో సరససల్లాపాలు జరిపి అతణ్ణి రైవతకంలో దింపి, తాను ద్వారకకు వెళ్ళాడు.

బలరామునికి తాపసులంటే అమిత గౌరవం, వారిని శ్రద్ధాభక్తులతో ఆదరిస్తూంటాడు.

కొన్ని రోజులు అలా గడిచాయి. రైవతకం మీద యాదవ కుటుంబాలు తరచు విందులు జరుపుకుంటారు. రైవతకాద్రి సుందరమైన పర్వతం, ఎత్తైన వృక్షాలు. ఆరు ఋతువులలో మనసిచ్చి పూచే రంగు రంగుల పూలు, రకరకాల పక్షుల కిలకిలరావాలు, చక్కని, నిర్మలమైన, తీయని జలాలిచ్చే సెలయేళ్ళు హృదయాలకు ఎంతో హాయిని శాంతిని చేకూర్చే ప్రదేశమది. యాదవ కుటుంబాలన్నీ అక్కడికి వనభోజనాలకు వెళ్లారు. అక్కడే తన కుటీరం ముందున్న అరుగు మీద అర్జునుడు కూర్చున్నాడు. కిలకిలనవ్వుతూ, ఆనందంతో వస్తూన్న ఒక యువతీ బృందం అతనికి కనిపించింది. వారిలో అతని దృష్టి ఒక యువతి ఆకర్షించింది. పూలు





కడిగిన ముత్యంలా సోయగాలు కురిసే చూపులతో, ఒయ్యారాలొలికే నడకతో, హాయిగా నవ్వుతూ, ఎగురుతూ వస్తూన్న ఆ యువతి తప్పక సుభద్ర అయి ఉండాలి - తాను విన్న వర్ణనకు ఆమె రూపమే సరిపోతుంది.

ఆ వెనుకే కృష్ణుడు వచ్చాడు. అర్జునుడు తననాపుకోలేకపోయినాడు. "కృష్ణా!' అని నెమ్మదిగా అరుగుదిగాడు.

అర్జునుణ్ణి త్వరపడవద్దని సంకేతించి, 'చూచావుగా, ఆమే సుభద్ర' అని మృదువుగా కొంటెగా కృష్ణుడు నవ్వాడు.

'కృష్ణా! ఎలాగైనా నీవే మా ఇద్దరినీ కలపాలి' అని అర్జునుడు కృష్ణుని చేతులు పట్టుకున్నాడు.

'అర్జునా! వివాహాలు ఎన్నో విధాల జరుగుతాయి. సుభద్ర మనసును గెలిస్తే, ఆమెను ఇంద్రప్రస్థానికి తీసుకొని వెళ్లి పెండ్లి చేసుకోవచ్చు. అది క్షత్రియోచితంగా ఉంటుంది కూడా. త్వరపడకు. వెళ్లి ఆ గుట్ట మీద దేవాలయం ముందు ఒక ప్రక్కగా కూర్చో, ధ్యానస్థుడవై ఉండు. మరి ఎవరిని ధ్యానిస్తావో నీ ఇష్టం. తరువాత ఏమి జరుగుతుందో చూడు' అని నెమ్మదిగా వెళ్లిపోయాడు.

అర్జునుడు కృష్ణుడు చెప్పినట్లే దేవాలయ పార్శ్వభాగంలో ఒక చెట్టు క్రింద బండ మీద అర్ధ నిమీలితుడై కూర్చున్నాడు.

కొద్దిసేపటికి బలరాముడు, కృతవర్మ, సాంబ, ప్రద్యుమ్న, సారణ, గదాదులతో దేవాలయానికి వచ్చి ప్రదక్షిణ చేయడానికి కదిలారు. ప్రదక్షిణ మార్గంలో ఒక యువ యతి కండ్లు మూసుకొని ధ్యానస్థుడై యుండడం చూచాడు. బలరాముడు ఆ తాపసి వ్యక్తిత్వానికి, అతని ముఖంలో కనిపించే వర్చస్సుకు, అతని ధ్యాననిష్ఠకూ ఆకర్షితుడైనాడు. చేతులు జోడించి ఆయనకెదురుగా అలా కొద్దిసేపు నిల్చున్నాడు.

అర్జునుడు నెమ్మదిగా కనులు తెరిచాడు. అతనికి ధైర్యం వచ్చింది. తనను ఎవరూ గుర్తించలేదు. ఎదురుగా నిల్చున్న వాళ్లలో గదుడూ,

సారణుడూ కూడా ఉన్నారు. హస్తినలో వాళ్లిద్దరూ తనకు సన్నిహితంగా మెలిగేవాళ్లు. వాళ్లు కూడా తనను గుర్తించలేదు. అందరి ముఖాన పెరిగిన మీసాలు, గడ్డాలు ప్రభావం. బలరాముడు ఆ తాపసి ముందు మోకరిల్లాడు.

'యతివర్యా! నేను వసుదేవుల వారి కుమారుణ్ణి వీరంతా మా కుటుంబ సభ్యులే. మీరిక్కడికి రావడం మా అదృష్టం. ఇక్కడ మీరెన్నాళ్లు ఉండదలచు కున్నారు? మీ కార్యక్రమమేమిటో తెలిపితే మీకు సర్వ సౌకర్యాలు కలుగచేసే అదృష్టానికి మేము నోచుకోవచ్చు.

'తిరిగి తిరిగి అన్ని ప్రదేశాలు చూచిన తర్వాత ఇక్కడికి వచ్చాను. ఇంతవరకు ఎక్కడా మూడు రాత్రుల కంటే ఎక్కువ గడపలేదు. అది మా నియమం. కాని వర్ష ఋతువు వచ్చింది. ఆకాశం మేఘాచ్ఛన్నమవు తున్నది. ఇహ ఈ నాలుగు నెలలు ఎక్కడైనా దీక్షలో గడపాలి. ఈ రైవతకం శాంతి నిలయంగా ఉన్నది. నా తపస్సుకూ, ధ్యానానికి, యోగాభ్యాసానికి చక్కని స్థలమిది'.

ఈ యువ తాపసి నాలుగు నెలలు రైవతకంలో ఉండ నిశ్చయించు కున్నాడని విని బలరామునికి పరమానందం కలిగింది.

కొద్దిసేపటికి కృష్ణుడు కూడా మిత్రులతో కలిసి అక్కడికి వచ్చి, ఆ తాపసికి సాష్టాంగంగా నమస్కరించి, వినయం నటిస్తూ చేతులు జోడించి నిల్చున్నాడు.

'కృష్ణా! ఈ యతీంద్రుల వారు మన అదృష్టం కొద్ది చాతుర్మాస్యం రైవతకంలో గడుపుదామనుకుంటున్నారు'.

'మంచిదే కదా!' అన్నాడు కృష్ణుడు.


'నాకు ఒక ప్రదేశం బాగుంటుందనిపిస్తున్నది' బలరాముడు ఆలోచిస్తూ అన్నాడు.

'ఎక్కడ అంటారు?'

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

తాము ఉద్ధరించవలసిన భక్తుని మొదట ప్రాపంచికంగా సంతుష్టుడిని చేసి, తరువాత పారమార్థిక పథోన్ముఖుడిని చేసిన సద్గురువుగా శ్రీ సాయి సమర్థతకు అద్దం పట్టే ఈ లీల యొక్క వెలుగులో పరికిస్తే "నా భక్తుడు అడిగినవన్నీ నేను ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలుచు కుంది వారు అడిగేంత వరకు" అనే బాబా వచనంలోని సారం సంపూర్ణంగా బోధ పడుతుంది. సరి!

శ్రీమతి కపర్దే ఒకసారి ఎంతో భక్తి ప్రేమోద్విగ్న భావంతో బాబా పాదాలను నొక్కుతుంటే, బాబా కూడా అంతే ప్రేమతో ఆమె చేతులను పట్టసాగారు. ఇది ఒక అద్భుతమైన లీల! ఈ లీలను మనకు అందించే ప్రతి అక్షరంలో అణువణువున తొణకిసలాడుతూ దివ్య ప్రేమభావం దర్శన మవుతుంది. ప్రేమపూరిత భక్తి కోసమై భగవంతుడు పరితపించే తీరుకు సజీవ సాక్ష్యంగా బాబా చర్య ఈ లీలలో ద్యోతకమవుతుంది. తనను తాను మరచి ప్రేమించే భక్తునికి అంతే ప్రేమతో సేవ చేసుకోవడం భగవంతునికి ఎంతో ప్రీతిప్రాయం అని స్పష్టంగా ప్రస్ఫుటమవుతుంది. భక్తుడు (భక్తురాలు) అచంచలమైన ప్రేమతో భగవంతుని సేవలో లీనమైతే, భగవంతుడు కూడా ఎనలేని ప్రేమతో భక్తుని సేవలో లీనమయ్యారు. అందువలన భగవంతుడు, భక్తుడు అనే ద్వైతం అంతరించి, స్వచ్ఛమైన దివ్య ప్రేమలో వారిరువురు ఏకత్రమైన మనోహర దృశ్యకావ్యం అక్కడ ఆవిష్కృతమైంది. వారిరువురి ఏకత్వం, భక్తుడు, భగవంతుడు ప్రేమ భావంతో ఏకమయ్యే తీరుని వర్ణించే మహాసంత్ కబీర్ యొక్క **"బూంద్**

**సమాని సమద్ మే .... సమద్ సమానీ బూంద్ మే .....**" అనే గీతం గురుతుకు తెప్పించక మానదు. నీటి బిందువు (భక్తుడు) సముద్రంలో (భగవంతునిలో) లీనమయింది. అలాగే, సముద్రం (భగవంతుడు), నీటి బిందువులో (భక్తునిలో) లీనమయింది. తద్వారా ఇద్దరు తమ అస్థిత్వాన్ని కోల్పోయారు అనే ఆ గీతంలోని భావానికి దృశ్యరూపంగా ఆ సంఘటన నిలుస్తుంది.

హార్దాకు చెందిన కొందరు భక్తులు రాధాకృష్ణాఆయి సలహా ప్రకారం బాబా కోసం ఒక పల్లకీని తయారుచేయించి తీసుకువచ్చారు. బాబా దాని మీద ఎటువంటి ఆసక్తి కనపరచకపోవడంతో, ఆ పల్లకీ పార్శిల్‌ను మసీదు సభా ప్రాంగణంలో అలాగే పెట్టేసారు. సుమారు నెల పైగా కాలం గడిచింది. బాబా కనీసం దాని వంక కూడా చూడటం లేదు. బాబా ఆజ్ఞ లేకుండా ఆ పార్శిల్‌ను విప్పి పల్లకీని బిగించే ధైర్యం ఎవరికీ లేదు. చివరకు రఘువీర్ భాస్కర్ పురంధరే అనే భక్తుడు, ఒకరోజు బాబాకు ప్రణమిల్లి "బాబా, ఈ రోజు ఆ పార్శిల్‌ను విప్పదీసి పల్లకీని బిగిస్తారు" అని అభ్యర్థించాడు. అందుకు బాబా "నాకు అవసరం లేదు" అని అన్నారు. "పల్లకీ వచ్చి ఇక్కడే పడి ఉంది. ఇప్పుడు నాకు అవసరం లేదని మాత్రం ఏం ఉపయోగం? నేను వెళ్ళి బిగిస్తాను. సాయంత్రం చావడి ఉత్సవంలో మిమ్మల్ని ఆ పల్లకీలోనే తీసుకువెళతాం" అని చెప్పి, బాబా అనుమతి కోసం వేచి చూడకుండా, వెళ్ళి ఆ పల్లకీని బిగించే పనిలో తాను నిమగ్న మయ్యాడు. బాబా తిట్ల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. కానీ, పురంధరే ఆ తిట్లను పట్టించుకోకుండా, పల్లకీని బిగించేసాడు. సాయంత్రం మరలా వచ్చి, ఆ పల్లకీని పూలతో అలంకరించి, బాబాను అందులో కూర్చోమని అభ్యర్థించగా, బాబా ససేమిరా కుదరదన్నారు. చివరకు బాబా పాదరక్షలను ఆ పల్లకీలో ఉంచి చావడి వరకు తీసుకువెళ్ళారు. తరువాత ఆ పల్లకీ చావడి బయట కొన్నిరోజులు ఉండిపోయింది. అప్పుడు కొందరు దొంగలు





ఆ పల్లకీ యొక్క వెండి కలశాన్ని, మక్మల్ పరుపును, గలేబులను ఎత్తుకెళ్ళారు. ఆ విషయాన్ని బాబాకు చెప్పగా "మొత్తం పల్లకీనే ఎత్తుకు పోయుంటే సరిపోయేది" అని అన్నారు. అప్పుడు అందరూ కలిసి మసీదుకు ఉత్తరం వైపున ఒక రేకుల గదిని నిర్మించి, అందులో పల్లకీని భద్రపరచా లని నిర్ణయించుకొని, ఆ బాధ్యతను పురంధరే భుజస్కందాలపై ఉంచారు. ఆ గదికి రేకులతో పైకప్పు వేయాలంటే మసీదు గోడలకు రంధ్రాలు కొట్టి, కర్రలను కట్టాలి. అందుకు బాబా ససేమిరా అంటారు. కానీ, పురంధరే మాత్రం ఒకరిద్దరి సహాయంతో బాబా లెండీకి వెళ్ళగానే పని ప్రారంభిం చాడు. బాబా లెండి నుండి తిరిగి రాగానే, జరుగుతున్న తతంగం చూసి, ఉగ్ర నరసింహావతారం ఎత్తి, పురంధరేపై తిట్ల వర్షం కురిపించారు. మెడ పట్టుకొని ప్రక్కకు లాగేసారు. అయినా సరే, పురంధరే మొండిగా "బాబా మీరు తిట్టండి, కొట్టండి. నేను మాత్రం గది నిర్మించనిదే ఇక్కడ నుండి కదలను" అని చెప్పి, తన పని తాను చేసుకుంటూ పోయాడు. బాబా అయితే కోపంతో ఊగిపోతూ తిట్ల వర్షం కురిపిస్తూనే ఉన్నారు.

మధ్యాహ్నం అయింది. ఆరతి ముగిసింది. భక్తులందరూ బాబా వద్ద సెలవు తీసుకొని ఇండ్లకు వెళ్ళారు. అందరూ భోజనం చేసారు. పురంధరే మాత్రం భోజనం గురించి పట్టించుకోకుండా తదేకంగా పనిలో నిమగ్న మయ్యాడు. బాబా కూడా భోజనం చేయకుండా పురంధరే భోజనం చేయలేదని తల్లడిల్లిపోసాగారు. "వాడిని ఏం చేయాలి? వాడు పిచ్చివాడు. అందరూ భోజనం చేసారు. కానీ, వాడు మాత్రం భోజనానికి వెళ్ళడు" అని అనసాగారు. చివరకు పురంధరేను భాగోజీ షిండే ద్వారా తమ వద్దకు పిలిపించుకొన్నారు. అప్పుడు బాబా "నీకు ఇష్టం వచ్చినట్లు చేయి. కానీ, ముందు వెళ్ళి భోజనం చేసిరా" అని అన్నారు. ఆ మాట విని పురంధరే తీవ్ర ఉద్విగ్నతకు లోనై "బాబా, ఉదయం నాపై అంత కోప్పడ్డారు. ఇప్పుడు నేను భోజనం చేయలేదని కలవరపడుతున్నారు.

**(సశేషం)**

సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

(గత సంచిక తరువాయి)

## హారతి

ఓం జయ జగదీశ హరే! సాయి జయ జగదీశ హరే
భక్త జనోంకే సంకట్! దాస జనోంకే సంకట్
క్షణమే దూర్ కరే ఓం జయ జగదీశ హరే
జో ధ్యావే ఫల్ పావే దుఃఖ మిట్ సే మన్ కా
సాయి దుఃఖ మిట్ సే మన్ కా
సుఖ సంపత్తి ఘర్ ఆవే (2)
కష్ట మిటే తన్ కా ॥ ఓం ॥
మాత పితా తుమ్ మేరే, శరణు పడు మై కిస్ కీ
సాయి శరణు పడు మై కిస్ కీ
తుమ బిన ఔర్ న దూజా (2)
ఆశ కరూ మై కిస్ కీ ॥ ఓం ॥
తుమ పూరణ పరమాత్మ - తుమ అంతర్యామి
సాయి తుమ అంతర్యామి
పారబ్రహ్మ పరమేశ్వర (2)
తుమ్ సబ్ కే స్వామి ॥ ఓం ॥
తుమ కరుణాం కే సాగర్ - తుమ పాలన కరతా
సాయి తుమ పాలన కరతా
మైమూరఖ ఖలు స్వామి (2)
మై సేవక్ తుమ స్వామి, కృపా కరో భరతా ॥ ఓం ॥





విషయ వికార మిటావో పాప హరో దేవా
సాయి పాప హరో దేవా
శ్రద్ధా సబూరీ బడావో (2)
సంతన్ కీ సేవా ॥ ఓం ॥
తన్, ధన్, మన్ సబహై తేరా సాయి సబ్ కుచ్ హై తేరా
తేరా తుఝుకో అర్పణ క్యాలాగే మేరా ॥ ఓం ॥

(సమాప్తం)

# మనస్సును మళ్ళించాలంటే ...

**- స్వామి శితికంఠానంద**

ఈ మధ్య బీహార్‌లో కల్తీ సారా త్రాగి ముప్పై మంది చనిపోయారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం చెల్లించాలని ప్రతిపక్ష నాయకులు కోరినప్పడు బీహార్ ముఖ్యమంత్రి అది పరోక్షంగా త్రాగటాన్ని ప్రోత్సహించినట్లవుతుందని ససేమిరా నష్ట పరిహారం చెల్లించేది లేదని చెప్పేశారు. 'ఎవరు త్రాగుతారో వారు చనిపోతారు' అన్నారు. మీరు త్రాగేది సారా కాదు విషం అని తెలుసుకోండి' అని మద్యపాన ప్రియులను పరోక్షంగా హెచ్చరించారు. మద్యనిషేధం అమలులో ఉన్న రాష్ట్రంలో మద్యాన్ని అమ్మటం, అదీ కల్తీ సారాను అమ్మటం నేరపూరిత చర్య కాబట్టి ఆ నేరస్థులను చట్టప్రకారం శిక్షిస్తామని ఆ ముఖ్యమంత్రిగారు సెలవిచ్చారు. బీద కుటుంబాలలోని కుటుంబ పెద్ద అలా చనిపోవటం చాలా బాధాకరం. వేరొక సందర్భంలో ఆయన తాను స్వామి వివేకానంద సూక్తి నుండి స్ఫూర్తిని పొంది తాను ఈ మద్యనిషేధ నిర్ణయాన్ని తీసుకున్నానని తెలియజేశారు. మొదట్లో ఈ మద్యనిషేధానికి తన పార్టీ సభ్యులనుంచే తీవ్రమైన ఒత్తిడి వచ్చినప్పటికీ స్వామీజీ చెప్పిన 'ప్రతి గొప్పపనికి ముందు అవహేళన ఎదురవుతుంది. తరువాత వ్యతిరేకత

చూపిస్తారు. అంగీకారం చివర్లో వస్తుంది' అన్న వాక్యం నుంచి స్ఫూర్తిని పొంది తాను ఈ మద్యనిషేధానికి పచ్చజెండా ఊపటం జరిగిందని తెలియజేశారు. మద్యనిషేధం తరువాత బీహార్‌లో చాలా శాంతియుత వాతావరణం నెలకొందని, ఒకప్పుడు త్రాగి వచ్చి భార్యలని కొట్టే భర్తలు ఇప్పుడు సాయంకాలానికి ఇంట్లోకి కూరగాయలు తీసుకురావటం చేస్తున్నారని, ప్రజలు జీవితాలు మెరుగుపడ్డాయని ఆయన తెలియజేశారు. బీహార్‌తో పాటు భారతదేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే ఈ మద్య నిషేధం అమలులో ఉంది. త్రాగటం వలన ముఖ్యంగా కుటుంబ యజమాని త్రాగటం వలన కుటుంబాలు కూలిపోతున్నాయని ఆ రాష్ట్రాల్లో అక్కడి ముఖ్యమంత్రులు మద్యనిషేధాన్ని అమలుచేస్తున్నారు. ఉద్దేశ్యం మంచిదే కానీ ఆచరణ యోగ్యమైనది కాదని మద్యనిషేధాన్ని ఎత్తివేయాలని కొద్దిమంది ప్రతిపక్ష నాయకులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా బీహార్‌లాంటి వెనుకబడిన రాష్ట్రంలో ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయాన్ని తీసుకువచ్చే మద్యాన్ని పూర్తిగా నిషేధించడం సాహసోపేతమైన నిర్ణయం.

అసలు మనిషికి మద్యం ఎందుకు అవసరమవుతుంది? మద్యం లేదా ఇతర మత్తునిచ్చే పదార్థాల నుంచి ప్రజలను, యువతను పూర్తిగా మళ్ళించాలంటే మనం ఏమి చేయాలి? శుక్రాచార్యుడంతటి ఋషి మద్యం మనిషి వివేకాన్ని కోల్పోయేటట్లు చేస్తుందని, త్రాగిన మైకంలో మనిషి విచక్షణను కోల్పోయి ఎన్నో నేరాలకు పాల్పడతాడని, కాబట్టి ఇదొక దురాచారమని ఆయన పేర్కొన్నారు. నిస్సందేహంగా ఇదొక సాంఘిక దురాచారం. తామసిక జనులలో ఉండే వ్యసనం. గౌతమబుద్ధుడు కూడా మద్యపానాన్ని ఎంతగానో నిరసించాడు.

పేదవాళ్ళు, కూలీనాలీ చేసుకునేవారు ఒకప్పుడు స్వయంగా తయారు చేసుకున్న మద్యాన్ని త్రాగేవారు. అందులో రసాయనాలు ఏమీ ఉండేవి





కావు. అది ఆరోగ్యానికి అంతగా అనర్థదాయకంగా ఉండేది కాదు. నేడు మార్కెట్‌లో లభ్యమవుతున్నది. రకరకాల రసాయనాలతో కూడుకున్నది. అదొక విషపదార్థం లాంటిదే! మెల్లగా కాలేయాన్ని, మూత్రపిండాలను నాశనం చేస్తుంది. ఇలాంటి కల్తీ మద్యాన్ని త్రాగి కొన్ని వందలమంది ఆర్థికంగా చితికిపోవటమే కాకుండా, అనారోగ్యాన్ని కొని తెచ్చుకొని అర్థాంతరంగా మరణించటం జరుగుతుంది. అందువలన కుటుంబాలు అప్పుల పాలవటం, కుటుంబ భారమంతా తల్లుల మీద పడటం, వారు ఆ భారాన్ని మోయలేక మానసికంగా, శారీరకంగా క్రుంగిపోవడం జరుగుతోంది. కొన్నిసార్లు తల్లిదండ్రులిద్దరూ అల్పాయువులుగా అవటం వలన పిల్లలు అనాథలుగా మిగలటం కూడా మనం చూస్తూనే ఉన్నాం. తమోగుణం ప్రబలంగా ఉండేవాళ్ళలోనే ఇదొక వ్యసనంగా పరిణమిస్తుంది. రజోగుణంలో ఉన్నవారు త్రాగినా మితంగానే త్రాగుతారు. మరీ సమాజంలో నగుబాటును కలిగించే వరకు దానికి బానిసవ్వరు. ఈ అలవాటు తమ పనికి అవరోధంగా ఉండకుండా చూసుకుంటారు. ఇక సత్త్వగుణంతో ఉన్న మనుషులకు వీటితో పని ఉండదు. వారు కలలో కూడా ఇలాంటి వాటిని తాకరు. తల్లిదండ్రులలో ఈ దురలవాటు కనుక ఉంటే పిల్లలకూ ఇది సంక్రమిస్తుంది.

శ్రామికవర్గం వారు, చాలా కాయకష్టం చేసేవారు మద్యపానం ఎందుకంటే, ఒళ్ళునొప్పులతో రాత్రి నిద్రపట్టదు. కాబట్టి తాగకుండా ఉండలేమని ఇంతకుముందు ఒక సాకు చెప్పేవాళ్ళు. ఇది కొద్దిమేరకు నిజమే. కానీ, నిజానికి శరీరం బాగా కష్టపడి ఉంటే వెంటనే నిద్ర వస్తుంది. నిద్ర సమస్య అస్సలు రాదు. అది కూడా పని అయిపోయిన తర్వాత సాయంకాలం మితంగా త్రాగేవారు. ఇప్పుడు అలా కాదు, పట్టపగలే త్రాగుతున్న వారి సంఖ్య చాలా పెరిగింది, ముఖ్యంగా పల్లెల్లో! ఇప్పుడిక కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో మద్యం అలవాటు లేనివాడిని వింతగా చూస్తున్నారని

కూడా కొంతమంది వాపోతున్నారు. ఇక్కడ కూడా నలుగురిలో నారాయణ అనాలట! మన మంచి అలవాట్లను కూడా మనం పరిరక్షించుకో కూడదట! అందరిలో ఒకరిగా ఉండాలట! హాస్యాస్పదమైన విషయం కదా! నలుగురు కలిసి పార్టీ చేసుకోవటమంటే నేడు తప్పకుండా కాక్‌టయిల్ ఉండాల్సిందే! ఆనందాన్ని పంచుకోవటానికి కూడా మద్యసేవనమే మార్గమట! మద్యం ఒక్కటే కాదు. ఇతర మత్తుపదార్థాలు కూడా ఈ స్థాయిలో మన సమాజంలోకి వస్తున్నాయంటే మన జీవన విధానంలో ఏదో లోపం ఉందని అర్థం.

**ఆలోచనలతో ఆనందంగా ఉన్నామా?** మన ఆలోచనలతో మనం సంతోషంగా ఉండటం చాలా ముఖ్యం. చదువు మనకు అందుకు దోహద పడాలి. మనుషులు రకరకాల వ్యసనాలకు బానిసలవ్వటం నిస్సందేహంగా మనసుతో ఏగలేకపోవటం వలన కలుగుతున్న పరిణామమే! మన ఆలో చనలతో మనం సంతోషంగా ఉండలేకపోవటంతో ఇలాంటి పరిస్థితులు ప్రబలుతున్నాయి. తన ఆలోచనలతో ఆనందంగా ఉన్న మనిషి ఎలాంటి వ్యసనాలకు బానిసవ్వడు. చిత్తం భగవానుడి బహు సంక్లిష్ట సృష్టి. మన అజ్ఞానం వలన అది ఇంకా సంక్షిప్తమై కూర్చుంది నేడు. త్యాగంతో మనసు కేంద్రీకరింపబడుతుంది. దానితో మనకు ఆనందం లభిస్తుందని ఋషుల, యోగుల మాట, నేడు ప్రతి విషయంలోనూ తోటి వారితో పోల్చుకొని అనవసరమైన కోర్కెలను పెంచుకొని మనసును నిక్షిప్తం చేసుకోవటం వలన ఆనందం తగ్గిపోతున్నది. మనిషికి సంతృప్తితో జీవించడమనేది అసాధ్యంగా పరిణమించింది. నిజమే, మిగతా వారికి ఉండి మనకు లేకపోతే బాధే! కానీ, ఈ ప్రపంచంలో మనకన్నా లేనివారు చాలామంది ఉన్నారు. మనకన్నా కలవారూ ఉన్నారు కదా అని అంటే, కలవారందరూ సంతోషంగా లేరే! సంపద పెరిగినంత మాత్రాన సంతోషం పెరగాలని లేదు. సంతోషానికి సంస్కృతి, ఆధ్యాత్మికతయే ఆలంబన.





స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన మూలాలను అర్థం చేసుకోవడానికి మనం ప్రయత్నం చేయలేదు. పాశ్చాత్యుల విలువలను మన సమాజంలోకి తీసుకురావడానికి తొందరపడ్డాం. మన నాగరికతను, మన జీవన విలువ లను అర్థం చేసుకోవడంపై మనం దృష్టి పెట్టలేదు. వాళ్ళు అభివృద్ధి చెందిన వారు, వారిలాగా అభివృద్ధిని సాధిస్తే అంతులేని ఆనందం మన సొంత మవుతుందని భావించాం. ఇక్కడే పొరబడ్డాం. కోరికలు పెరుగుతున్న కొద్దీ మనసు నిక్షిప్తమవుతుంది. ఆనందం శాతం తగ్గిపోతుంటుంది. లోపలి ఆనందం వెలితిని, శాంతిలేమిని పూడ్చుకోవటానికి మనిషి రకరకాల వాటికి బానిసవుతుంటాడు. ముక్తి లక్ష్యంగా ఉన్నప్పుడే మనిషికి త్యాగవైరాగ్యాలు రుచిస్తాయి. అందరూ ఎందుకు ముక్తిని జీవన పరమా ర్థంగా పెట్టుకోలేకపోతున్నారు. అదీ త్యాగభూమైన భారతావనిలో! కారణం .... రావాల్సిన ఆధ్యాత్మిక బీజం పుట్టుకతో రాకపోవడమే! తల్లిదండ్రులు తపస్సుతో, దైవప్రార్థనతో సంతానాన్ని కంటే జన్మతః వచ్చిన ఆ సంస్కారం వారిలో అలా ఉంటుంది. అలా పుట్టిన బిడ్డలను సమాజం లోని చెడు ప్రభావితం చేయలేదు. కాబట్టి వారెప్పుడూ సకారాత్మకమైన వాటిపైననే దృష్టి పెట్టగలుగుతారు. ధర్మాన్ని అనుసరిస్తారు. ముక్తిని కోరుకుంటారు. తల్లిదండ్రులకు, సమాజానికి గర్వకారణంగా నిలుస్తారు.

**సంస్కార సంపద చాలా ముఖ్యం :** మఠంలోని ఒక బ్రహ్మచారి మహరాజ్ వారింటి పరిస్థితిని ఇలా వివరించారు. వారి సోదరుడి కుమారుడిని, నానమ్మగారు అంటే వీరి అమ్మగారు మంచి సంస్కారం ఇవ్వాలని వాళ్ళ నగరంలో ఉన్న మఠానికి తీసుకువెళుతుండేవారు. అలానే హనుమాన్ చాలీసాలాంటి పుస్తకాలు చదివించేవారు. ఇలాంటి ఆధ్యాత్మిక సంస్కారం ఇవ్వటం కోడలికి అంటే బ్రహ్మచారిగారి వదినగారికి ససేమిరా ఇష్టం లేదు. 'నా బిడ్డను పాడు చేస్తున్నావు' అని అత్తగారితో గొడవకి దిగి, ఆమె తన మనవడిని ఆశ్రమానికి తీసుకువెళ్ళకుండా ఆపేయించింది. శ్రీరామ

కృష్ణుల పరిభాషలో చెప్పాలంటే ఇలాంటి స్త్రీలు అవిద్యాశక్తులు. వీరికి సంస్కార విలువ తెలియదు.

నేటి సమాజంలో ఆధ్యాత్మికత లేకుండా సంతృప్తితో జీవించడం చాలా కష్టం. అన్ని సమస్యలకు అసలైన పరిష్కారం ఆధ్యాత్మికతతోనే లభిస్తుంది. వస్తు సముదాయాలతో సంబంధం లేకుండా లోపల ఉన్న దైవత్వాన్ని ప్రకటించుకొని మహనీయమైన మనిషిగా ఎదగటానికి ఎవరితోనూ పోటీ పడవలసిన అవసరం లేదు. మనిషి స్వరూపరీత్యా దేవుడు. ఆ నిజ స్వరూపానికి చేరువ చేసేదే ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక గ్రంథ పఠనం, ప్రకృతిని ప్రేమించడం, సామూహిక భజనలు, పాడటం, భక్తి సంగీతాన్ని వినడం, ధ్యానం, పరోపకార కార్యాలలో నిమగ్నమవడం, విశ్వశ్రేయస్సుకై ప్రార్థన చేయటం ..... ఇవన్నీ మన మనస్సును పవిత్రం చేస్తాయి. మనిషిని శక్తి మంతుడిగా చేస్తాయి. వ్యసనపరత్వం నుంచి బయటపడేస్తాయి. ఇలాంటి సహాయాన్ని అందించకుండా, ఆలంబనలకు తోడ్పాటునివ్వకుండా ఏ నిషేధాన్ని కూడా పూర్తిగా అమలుచేయడం ఏ ప్రభుత్వానికి కూడా సాధ్యపడదు.

# HUMAN BIRTH AND OPPORTUNITY

## (The Bloom of Inner Glory)

**- N.N. RAJAN**

To be born as a human being is a precious privilege and a piece of great good fortune. Birth as a human being has been described as one of the three rare gifts, the other two being the desire for liberation (Mumuksutwa) and association with great souls (Mahapurusha-samsraya). These three come only by the Grace of





God. the scripture declares that the human form of life has the highest scope for perfection. A man can integrate his experiences with a view to control the environment and, if necessary, to change it in tune with his hopes which the animal can seldom do.

***The purpose of Life :***

Therefore, we should ponder now and then about the purpose of human life. The goal of mankind is knowledge of God and not worldly enjoyments. Life should not be frittered away in the vain pursuit of worthless objects which do not lead to the knowledge of God. If one spends his entire life in the pursuit of worldly enjoyments, he will be like one who prefers poison to nectar. It is only by engaging ourselves in the pursuit of God-realization that we remain true to the real 'Self'.

"What value has this birth without knowledge born of realization? Can anything be likened to it, O Arunachala?"

"This birth without knowledge, born of realization, is worthless; nor do I attempt to surrender myself, O Arunachala!"

**- Sri Bhagavan's Marital Garland of Letters.**

The Contemparary World

***Man and Machine :***

We are now living in a troubled age which may well be called the dark age (Kaliyuga). Life is not simple and smooth, much as we would wish it to be; it is like a rough journey up a steep slope. We are living in a world that is fast changing. Many are the discoveries

and inventions of science. The first casualty of the mechanical sciences is the sense of values. 'Freedom' has been corrupted into licence. Faith in God, obedience to authority and belief in religion and scriptural duties prescribed for men and women, are at a discount and are denounced as worthless hangovers of a primitive past when man did not understand the world he lived in. Old world values do not suit the tremendous change that has overtaken life. The indiscipline in educational institutions, the purely casual and superficial relations of the teacher to the taught and the explosive behaviour of our young boys and girls are traceable to this loss of faith in the wisdom of the ages. Very often an entire nation acts, as a man, in selfish interests. Truth is distorted beyond recognition in order to suit an unwholesome ideology, and an issue is decided on a military plane. The thinking man looks blankly at this vast universe which is in the nature of a general free-for-all, where might is right.

***Need for Relaxation :***

After a long day's work everyone feels the need for relaxation; yet no one relaxes sufficiently. Everyone goes on working feverishly with the result that tensions mount up and result in near breakdown. Man exists but does not live. We must have time to sit and stare. After all, our needs and necessaries are only a few. If a person is satisfied with what he has, he will have enough time for relaxation. But driven by greed, man endlessly struggles for more and more possessions and is caught in a vicious spiral. There is no sense of security in life.

Diversity in outlook seems to be the normal rule. Our wants and desires grow on what they feed. A man whose crops are languishing





for want of water, prays for rain. His neighbour who is owning a brick-kiln prays that there should be no rain. Both pray to God. Each is interested in his own welfare. In the midst of the difficulties and anxieties of life, some indulge in doing acts which are injurious to others. They do not care for justice or humanity but only for their prosperity.

We are surprised when history and legends tell us that in ancient times there was greater happiness, peace and contentment even in the absence of scientific advancement. Why should there be such misery now? It can be clearly proved that we alone are responsible for the present chaotic condition in society. We are indifferent to religion and to God. We are enamoured of our materialistic achievements, but we close our eyes to the higher values of life. If it were merely in winning a game that you are interested, how can one expect justice and fairplay in the gamble? If there is no faith in the ethical rules that govern our life and in the ultimate decency of things, then the law of the jungle would be the only result and the innocent would be in peril.

Only contented men can maintain peace of mind. But unfortunately the power to curb temptations and desires is at a low ebb in us. Consequently, our balance is lost and desires envelop and ruin us. We need therefore the counsel of the wise.

"Where is there a wretch
So loathsome and wicked as I?
I have forsaken my Maker,
So faithless have I been"

- *Saint Surdas*

# సాయీ తత్వ ప్రచారంలో మీరూను...

శ్రీ సాయీ తత్వ ప్రచారానికై లక్షింపబడిన మాసపత్రిక "సచ్చిదానంద సద్గురు సాయివాణి"కి చందాదారులుగా చేరండి. మీ మిత్రులను, సాయి బంధువులను చందాదారులుగా చేర్పించండి. బంధు మిత్రుల వివాహాది శుభసందర్భాలలో 'సాయివాణి' ఆజీవ సభ్యత్వం (10 సం.లు) కానుకగా అందించండి. సాయివాణిని చదవండి, చదివించండి, అందులో చెప్పబడిన పెద్దల మాటలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించండి. ఆజీవ సభ్యత్వం రూ.1,000/-లు చెల్లించువారు సాయిధామం ఆశ్రమ చిరునామాకు (మొదటి పేజీలో కలదు). మనియార్డరు ద్వారాగానీ, డ్రాఫ్టు ద్వారాగానీ "SRI SAI SEVA SAMITHI TRUST" పేరిట పంపించగలరు. దానిలో మీ అడ్రసు, ఫోన్ నెంబరు స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా వ్రాయగలరు.

అడ్రస్ మారినవారు మీ క్రొత్త అడ్రస్‌తోపాటు మీకు ఇవ్వబడిన సాయివాణి కోడ్ నెంబరును తెలియపరచవలెను.

సాయిధామంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలకు ఆర్థిక రూపంలోగానీ, వస్తురూపంలోగానీ, శ్రమ సేవ రూపంగా కాని మీకు చేతనైనంత వరకు తోడ్పడండి. 80జి పన్ను మినహాయింపు కలదు.

శ్రీ సాయీ తత్వప్రచార సత్కార్యంలో మీరూ పాలుపంచుకోండి, మీ జీవితాలను ధన్యం చేసుకోండి.





# నువ్వెవరు? నేనెవరు?

మహాభారత యుద్ధంలో పదమూడో రోజు దాయాదుల దాష్టీకానికి దయనీయంగా అసువులు బాశాడు అభిమన్యుడు. కన్నకొడుకు కన్ను మూశాడని తెలిసి అర్జునుడు ఆక్రోశించాడు. ఆవేశంతో జయద్రథుణ్ణి తదితరులను హతమార్చాడు. అయినా అర్జునుడి ఆవేదన తీరలేదు. సర్వజ్ఞుడూ, సాక్షాత్తూ భగవానుడూ అయిన శ్రీకృష్ణ పరమాత్ముణ్ణి ఆశ్రయించాడు. ఆనాడు గురుదేవులైన సాందీపుడి కుమారుడిని రక్షించిన ఉదంతాన్ని గుర్తు చేసి, తనకూ పుత్రభిక్ష పెట్టాల్సిందిగా పార్థుడు ఆ పరాత్పరుడిని వేడుకున్నాడు. ఇంత భగవద్గీత బోధించినా, పుత్రవాత్సల్యంతో విలవిలలాడిపోతున్న విజయుడిని చూసి విస్మయం చెందాడు ఆ విశ్వంభరుడు. పుట్టినవారు గిట్టక తప్పదని, 'జాతస్య హి ధ్రువో మృత్యుః...' అని మరోమారు జ్ఞాపకం చేశాడు.

ఎవరికి ఎవరూ శాశ్వతం కాదని ఎంత చెప్పినా, కడుపు శోకం కిరీటిని కర్తవ్యతా విమూఢుణ్ణి చేసింది. అప్పుడు ఆ పరంధాముడు ఆ పాండుపుత్రుడికి ప్రత్యక్షంగా పాఠాన్ని నేర్పాలనుకున్నాడు. 'సరే అర్జునా! స్వయంగా ఆ స్వర్గలోకానికి నిన్నే తీసుకువెళతాను. నీవే అభిమన్యుడిని ఈ భూలోకానికి వెంట తెచ్చుకో" అన్నాడు. ఆనందంతో అంగీకరించి, శ్రీకృష్ణుడితో కలసి స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ యువరాజుగా కిరీటధారియై అభిమన్యుడు ఠీవిగా కూర్చొని రాచకార్యాల్లో మునిగి వున్నాడు.

అర్జునుడు అమితానందంతో కొడుకు దగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళాడు. 'నాయనా! భూలోకానికి వెళదాం రా!' అన్నాడు. అభిమన్యుడు ఆశ్చర్యపోతూ, 'ఎవరు నువ్వు? నేను నీతో భూలోకానికి రావడం ఏమిటి?' అన్నాడు.

'నేనెవరో తెలియదా? నేను నీ తండ్రిని!' అన్నాడు ఫల్గుణుడు. 'నీవెవరో నాకసలు జ్ఞాపకమే లేదు. ఎన్నో జన్మలు ఎత్తాను. నీవు ఏ జన్మలో తండ్రివో! పోషించిన పాత్రలు చాలు! నేను నీతో రాలేను; వెళ్ళిపో' అన్నాడు.

అప్పుడు కనువిప్పు కలిగింది కిరీటికి! మౌనంగా మాధవుడితో కలసి భూలోకానికి పయనమయ్యాడు. మనం కూడా ఆ అర్జునుడిలాగే మమకారాల అయోమయంలో పడి అసలు మర్మాన్నే మరచిపోతున్నాం. అందుకే 'భజ గోవిందం' పరంపరలో ఆదిశంకరాచార్యుల అనుంగు శిష్యులు సురేంద్రుడు ప్రతి ఒక్కరినీ 'నువ్వెవరో? నేనెవరో?' ప్రశ్నించుకోమంటూ....

**కష్ఠంకోఽహం కుత ఆయాతః కామే జననీ కో మే తాతః।**

**ఇతి పరిభావయ సర్వమసారం విశ్వం త్యక్త్వా స్వప్న విచారం ॥**

అని ప్రవచిస్తున్నారు. నువ్వెవరు? నేనెవరిని? నేను ఎక్కడి నుంచి వచ్చాను? నా తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? నిస్సారమైన కలలాంటి ఈ ప్రపంచాన్ని పక్కన పెట్టి ఆలోచించమంటున్నారు. సర్వం అసారమనీ; స్వప్నసమానమనీ హితవు పలుకుతున్నారు. వాస్తవం ఏమిటో తెలుసుకొని నడుచుకోమంటున్నారు.

**విచారణకు వెరపెందుకు?:** జన్మమృత్యు పరంపరాగతమైన ఈ జీవన చక్రం ఎందుకిలా పరిభ్రమిస్తుందోనని ఎవరికి వారు ప్రశ్నించుకోవడం లేదు! అసలు మనం ఇన్ని బంధనాల్లో ఎందుకు చిక్కుకుంటున్నామో ఆత్మావలోకనం చేసుకోవడం లేదు. ఇలా విచారణ చేసుకోవడం మొదలు పెడితే ఈ మాత్రం ప్రశాంతంగా కూడా ఉండలేమేమో అనే భయంతో చాలామంది సంసార కాసారంలో గుడ్డికప్పల్లా ఈదులాడుతున్నారు. ఆలోచిస్తూ పోతే మనం సాధించామనుకుంటున్నవన్నీ చిల్లిగవ్వల్లా అనిపిస్తాయన్న భయంతోనే అసలు ఆలోచించడమే మానేశాం. కానీ ఎప్పుడో ఒకప్పుడు ఆ చిల్లిగవ్వలను జారువిడుచుకోక తప్పదు.

అలా ఏదో జరిగిపోయాక పశ్చాత్తాపపడి వైరాగ్యం పెంచుకోవడం కన్నా, పూర్వతాపంతో ముందే వివేకంతో మెలగడం మంచిదని 'భజ గోవిందం' బోధిస్తోంది.

అందుకే మన సనాతన ధర్మం రెండు రకాల వైరాగ్యాల గురించి ప్రస్తావించింది. అవి రాజసిక వైరాగ్యం. సాత్త్విక వైరాగ్యం! సంపదనో,





పదవినో, హోదానో, బంధువులనో కోల్పోవడంలాంటి దుస్సంఘటనలు సంభవించినప్పుడు కలిగేది రాజసిక వైరాగ్యం. బాహ్యకారణాలేవీ లేకుండానే కేవలం పరిశీలనాత్మకమైన బుద్ధిచేత, నిత్యానిత్య వివేకం వల్ల ప్రాప్తించేది సాత్త్విక వైరాగ్యం. రాజసిక వైరాగ్యం కన్నా, సాత్త్విక వైరాగ్యం మనలో శాశ్వతమైన మార్పును తీసుకువస్తుంది. అలా స్వయంగా తాము వ్యక్తిగత కష్టనష్టాలనేమీ అనుభవించకపోయినా, గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు, గురునానక్, మహమ్మద్ ప్రవక్తలాంటి మహాత్ములు ఈ లోకుల అజ్ఞాన జనిత దుర్భరస్థితులను చూసి వైరాగ్యాన్ని పొందారు. అలాంటి వైరాగ్యాన్ని సమర్థిస్తూ ఇలా అన్నారు మన మహర్షులు :

**భీభత్సం విషయం దృష్ట్వా కోనామ నవిరజ్యతే?।**

**సతాముత్తమ వైరాగ్యం వివేకాదేవ జాయతే॥**

జీవితంలో బీభత్సమైన విషయాలు చూసినప్పుడు వైరాగ్యం ఎవరైనా పొందుతారు. అది సహజమే. అందులో మహత్తరమైన విషయం ఏముంది? అయితే ప్రాజ్ఞులకు వైరాగ్యం ఇతరుల కష్టసుఖాలను చూసినప్పుడో, ఏకాంతంలో స్వవిచారణ వల్లనో కలుగుతుంది. అలా ప్రాజ్ఞులమయ్యేందుకు ప్రయత్నించాలి.

**కల్పనలకు కలవరమా?:** భగవాన్ రమణులు 'నేనెవరు?' అని ప్రశ్నించుకుంటూ ముందుకు సాగిపోవడమనే జీవితంలోని అన్ని సమస్యలకూ పరిష్కారమనేవారు. ఇలా ఎప్పటికప్పుడు నిత్యజీవనంలోని అనుబంధాలను ఎలాంటి దాపరికం లేకుండా విశ్లేషించుకుంటూ పోతూ ఉంటే, ఒక్కటొక్కటిగా దారపు పోగుల్లా విడివడి అసలు స్వరూపం అర్థమవుతుంది. అప్పుడు ఈ కష్టసుఖాలు, రాగద్వేషాలు, జయాపజయాలన్నీ కాలంలో పుట్టి, కాలంలో కలసిపోయేవిగా, స్వప్నంలోని సంఘటనల్లా తోస్తాయి. ఏకాంతంలోకి వెళ్ళి కాసేపు ఈ ప్రపంచాన్ని పక్కనపెట్టి, అసలు మనమేంటి? అని ఆత్మపరిశీలన చేసుకుంటే జీవితంలో ఇంత అలజడి ఉండదు.

దీనికి పెద్ద సాధనలేమీ చేయనక్కరలేదు; సన్యాసులేం కానవసరం లేదు. కేవలం కళ్ళ ముందు జరుగుతున్న వాటిని చూసి అంతర్మథనం చేసుకుంటే చాలు! అయితే దురదృష్టవశాత్తూ ఆధునిక ప్రపంచంలో విషయ సుఖాలు ఏకాంతం నుంచి మనల్ని దూరం చేస్తున్నాయి. నిరంతరం ఏదో ఒక వ్యసనంలోనో, వ్యాపకంలోనో పొద్దుపుచ్చేలా పురిగొల్పుతూ ఉన్నాయి. మన నిజవాసమేమిటో, మన నిజ గమ్యమేమిటో తెలియకుండా కళ్ళకు గంతలు కట్టి పరుగులు తీయిస్తున్నాయి. అశాశ్వతమైన అనుబంధాలను అజరామరమనుకునేలా భ్రమలు కల్పిస్తున్నాయి. అల్పమైన వాటి కోసం అపురూపమైనవి జారవిడుచుకునేలా ప్రలోభపెడుతున్నాయి. అందుకే గౌతమ బుద్ధుడు ...

**సుఖమాత్రా పరిత్యాగా త్పశ్యే చ్ఛేద్విపులం సుఖమ్**

**సుఖమాత్రాం త్యజేద్ధీరః సంపశ్యన్ విపులం సుఖమ్ ...**

'అల్పమైన సుఖాన్ని పరిత్యజించడం చేత అధికమైన సుఖం కలుగుతుందని అనుకున్నప్పుడు, బుద్ధిమంతుడపై అధికమైన సుఖం మీద దృష్టితో అల్పసుఖాన్ని విడిచిపెట్టమ'ని హితవు పలుకుతాడు.

**మితిమీరితే మనస్తాపం :** ఎవరితోనూ మితిమీరిన మానసికానుబంధాన్ని పెంచుకోకూడదు. వారి తోటిదే లోకమనుకోకూడదు. అలా దశరథుడు లేకలేక కలిగిన కొడుకు శ్రీరామచంద్రుడిపై విపరీతమైన మమకారాన్ని పెంచుకున్నాడు. కానీ, కాలం కైక రూపంలో ఆ మమకారంపై కాటేసింది. ఇలా పరిమితిని మించి ప్రేమ పరిధులు దాటుతున్న ప్రతి సందర్భంలోనూ 'నేనెవరు? వారెవరు?' అని ప్రశ్నించుకుంటూ ఉండాలి. కాంక్షను పెంచుకున్న ప్రతి వ్యక్తినీ, వస్తువునూ కనికరం లేకుండా మన నుంచి లాగేసుకోవటమే కాలపురుషుడి పని! కడలి కెరటం హఠాత్తుగా వచ్చి, పసిపిల్లాడు తీరంలో ప్రీతిగా కట్టుకున్న ఇసుకగూటిని తనలో కలిపేసుకున్నట్లు, కాలం మనకిష్టమైన వాటన్నింటినీ నిర్దాక్షిణ్యంగా తనలో లయం చేసుకుంటూ ఉంటుంది. ఆ సత్యాన్ని గుర్తెరిగి అను దినం





ఆత్మీయతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 'భగవంతుడే నిత్యం, తక్కినవన్ని అనిత్యం. జీవులు, జగత్తు, ఇల్లూ-వాకిలీ, పిల్లాజల్లా-ఇవన్నీ గారడీవాడి గారడీయే. అతడు కర్రతో డోలును వాయిస్తూ 'క్షూ క్షూ మంత్రరాశీ', రండి, గారడీ చూడండి' అంటూ ఉంటాడు. ప్రేక్షకులతో 'రండి, ఈ కుండ మూత తీయండి' అంటాడు. మూత తీయగానే కుండలో నుంచి అనేక పక్షులు ఆకాశంలోకి ఎగిరిపోతాయి. కానీ గారడీవాడే సత్యం; వాడు చేసే గారడీ అంతా అనిత్యం. అనిత్యమనేది అప్పటికప్పుడు ఉంటుంది; ఇంతలోనే మాయమైపోతుంది' అనేవారు.

**ఇహపరాలన్నీ ఈశ్వరచ్ఛాయలే!:** దీర్ఘంగా ఆలోచిస్తూ పోతే ఈ లోకంలో స్థిరమైనవాడు, శాశ్వతమైనవాడు ఆ భగవంతుడు ఒక్కడే! ఒక్క మాటలో చెప్పాలంటే ఇహపరాలన్నీ ఆ ఈశ్వరుడి ఛాయలే! తను పరోక్షంగా ఉండి, ఈ సమస్త ప్రపంచాన్నీ పసిపాపను చేసి ఆడిస్తూ ఉన్నాడు. ఈ జగత్తులో ఉండే పదార్థాలన్నీ విచారించి చూడనంత వరకే మనోహరంగా కనిపిస్తాయి; విచారణ అంతా ముగిశాక మనోహరుడు ఆ మాధవుడేనని అర్థమవుతుంది. అందుకే ప్రపంచంలోని అందాలు, ప్రేమలు, సౌఖ్యాలు- అన్నీ ఈశ్వరచ్ఛాయలే. వాటివల్లనే ఆకర్షిస్తాడు, తనని గుర్తింపజేస్తాడు ఈశ్వరుడు. కానీ, తీరా ఆయనను తెలుసుకోవాలంటే ఈ అందాలే. ఆకర్షణలే మానవుడి పురోగమనానికి అభ్యంతరాలవుతాయి. అదే మాయ అంటారు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్. 'గీతాంజలి'పై వ్యాఖ్యానం వ్రాస్తూ ఓ కవి! ఆ మాయను ఛేదించుకోవాలంటే మళ్ళీ ఆ పరమ ప్రభువు పాదాలనే ఆశ్రయించాలి. విచారణ కన్నా ముందు ఆయనపై విశ్వాసాన్ని పెంచుకోవాలి.

బందీలుగా చేసేదీ తనే! బంధనాలు తెంచేది తనే! కనుక సంపూర్ణ శరణాగతితో ఆ సర్వేశ్వరుణ్ణి ఆశ్రయిద్దాం! జనన మరణాల గుట్టు విప్పి, మనల్ని గట్టెక్కించమని వేడుకుందాం!